క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం లోని అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, సహస్ర నామార్చనలు, పండిత పరిషత్, హోమాలు చేపట్టారు. అనంతరం ఆలయ సమీపంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో కమిటీ సభ్యులతోపాటు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ ధనుంజయరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా గణపతి ధనుంజయరావు నియమితులయ్యారు. ఇంతవరకు ధనుంజయరావు ఆమదాలవలస జూనియర్ కాలేజీలో బోటనీ అధ్యాపకునిగా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై కొత్తూరు ప్రిన్సిపాల్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు కొత్తూరు కాలేజీలో అధ్యాపకునిగా పనిచేసిన రవికుమార్ ప్రిన్సిపాల్‌గా (అదనపు బాధ్యతలు) పని చేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ధనుంజయరావుకు కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



ప్రత్యేకావసరాల చిన్నారిని గుర్తిస్తున్న ఎంఈఓ–2 రాజారావు

పొందూరు: మండలంలో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వేను ప్రారంభించామని ఎంఈఓ–2 పట్నాన రాజారావు తెలిపారు. మంగళవారం పొందూరు గ్రామంలో ప్రత్యేకావసరాల చిన్నారి కె.భరద్వాజ్‌ను గుర్తించామన్నారు. 0–18 ఏళ్ల వయసు గల బడి బయట ఉన్నవారిని గుర్తించి నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు దినేష్, రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

పాతపట్నం: ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ పి.చంద్రకుమారి సూచించారు. మండలంలోని కొరసవాడలో మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావుతో కలిసి మంగళవారం పర్యటించారు. రూఫ్ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు జూన్ 12వ తేదీలోగా పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ సీతారామరాజు, సర్పంచ్ ఉమ, సెక్రటరీ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామం వద్ద పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. బమ్మిడి గ్రామానికి చెందిన దివిలి తిరుపతిరావు పది మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ తెలిపారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. తిరుపతిరావుపై కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా సంగమేశ్వరుని కల్యాణం

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలసలో గల సంగమేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి శోభాయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుంది. గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

19న ఇంటర్వ్యూలు

సరుబుజ్జిలి: ఈ నెల 19న ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎం.పావని మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు, ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుతో హాజరుకావాలన్నారు.

నరకయాతన



రాళ్లుతేలిన సిద్ధాంతం రోడ్డు

- రోడ్డు నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడు..?
- ఏడాదిగా రాళ్లువేసి వదిలేశారు..
- నాలుగు కిలో మీటర్లు నరకం
- మాది కాదంటే.. మాది కాదని చేతులెత్తుస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది జనవరి (సంక్రాంతి) నాటికే రోడ్లన్నీ అద్దంలా తయారు చేస్తామని కూటమి పెద్దలు ఊదరగొట్టారు. పలుచోట్ల రహదారుల మరమ్మతుల పేరిట పైపై పనులు చేపట్టారు. ఎల్.ఎన్.పేట మండలంలోని సిద్ధాంతం రోడ్డు నిర్మాణం పనులు ఏడాదిగా గాలికి వదిలేశారు. మండలంలోని పలు గ్రామాలతోపాటు సరుబుజ్జిలి మండలం మతలబుపేటతోపాటు మరికొన్ని గ్రామాలను కలిపే లింకు రోడ్డు ఇది. సిద్ధాంతం రోడ్డు నిర్మాణం పనులు ఎప్పుడు పూర్తి చేస్తారా? అని సుమారు పది గ్రామాలకు చెందిన ప్రజలు ఎదురు చూస్తున్నారు. చెరువులను తలపించే గోతులతో ఉన్న సిద్ధాంతం–మతలబుపేట రోడ్డు నిర్మాణం పనులు ఏడాది క్రితం కొంతమేర చేపట్టారు. ఎన్నో ఏళ్ల తరువాత రోడ్డు బాగుపడుతుందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వారి సంతోషం ఎన్నో రోజులపాటు నిలువలేదు.

పలు గ్రామాలకు మేలు

ఈ రోడ్డు నుంచి ఎల్.ఎన్.పేట మండలం సిద్ధాంతం, సుమంతాపురం, బరటాం, గడేవానిపేట, కృష్ణాపురం, సిద్ధాంతం ఎస్సీ కాలనీలతో పాటు సరుబుజ్జిలి మండలం మతలబుపేట, పెద్ద మతలబుపేట, మాలపేట, తెలికిపెంట, కాగితాపల్లి, పాతపాడు, పర్వతాలపేట తదితర గ్రామాలకు వెళ్లవచ్చు. మరో పది రోజుల్లో పనులు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపటతామని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు.

మాకు సంబంధం లేదు..

రోడ్డు నిర్మాణం పనులు నాలుగు శాఖల ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలో లేదంటే.. తమ పరిధిలో చేపట్టలేదని చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఐటీడీఏ, పీఐయూ శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు తమ పరిధిలో చేపట్టలేదని స్పష్టం చేశారు. సిద్ధాంతం రోడ్డు పనులు కోసం ఏ శాఖ నుంచి నిధులు మంజూరు చేశారో జిల్లా అధికారులైనా స్పందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదీ రోడ్డు కథ..

ఎల్.ఎన్.పేట మండలంలోని ఏబీ (అలికాం–బత్తిలి) రోడ్డు నుంచి సిద్ధాంత మీదుగా మతలబుపేట వరకు సుమారు ఆరు కిలో మీటర్ల మేర రోడ్డు ఉంది. ఈ రోడ్డులో ఒకప్పుడు ఆర్టీసీ బస్సు కూడా నడిచేది. రోడ్డు బాగాలేదని బస్సును నిలిపివేశారు. గోతులతో ఉన్న రోడ్డు మరమ్మతులు కోసం ఏడాది క్రితం పనులు చేపట్టారు. రోడ్డు అంతా సరిచేసి మూడు నెలలపాటు వదిలేశారు. ఆ తరువాత రోడ్డుపై మిక్సింగ్ మెటల్ (రాళ్లు) వేసి రోలింగ్ చేసి సుమారు ఎనిమిది నెలలుగా అలాగే వదిలేశారు. ఇప్పుడు ఆ రోడ్డు మీద రాళ్లుతేలాయి. ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది.

ఏడాదిగా నరకంలా ఉంది



ఏడాది క్రితం రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి రాళ్లు వేసి వదిలేశారు. రోడ్డుపై ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ప్రయాణికులను తీసుకుని ఆటోలు వెళ్లేవి, ఇప్పుడు ఆటోలు కూడా రావటం లేదు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేయాలి.

– త్రిపురాన లక్ష్మణరావు, మాజీ సర్పంచ్, సిద్ధాంతం, ఎల్.ఎన్.పేట మండలం

మహిళా సాధికారత ఏదీ?



- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతను పట్టించుకోలేదని, ఆర్థిక భరోసా కల్పించలేదని, ఆత్మగౌరవాన్ని పట్టుకోవడం లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగనన్న పాలనలో మహిళల పేరిట అనేక పథకాలు అమలు చేసి, వారి ఖాతాల్లోనే డబ్బులు జమ చేశారన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించారన్నారు. వారి ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉండేదన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలను ఉచితంగా అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్ల నిండిన బీసీలకు పెన్షన్ వంటి పథకాలు ఏమయ్యాయని నిలదీశారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకోవటం, అధికారం చేపట్టిన తరువాత మోసం చేయటం చంద్రబాబు నైజమన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగనన్న పాలనలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్నారు.

కూటమి ఏడాది పాలనలో మహిళలను అన్ని విధాలా మోసం చేశారన్నారు. ఎన్నికల ముందు ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాల ఆర్థిక ప్రయోజనాన్ని అర్హులైన లబ్ధిదారులకు వడ్డీతో సహా చెల్లించాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రసాదరావు, రైతులు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామంలో నిర్వహించిన భూముల రీ సర్వేలో జరిగిన తప్పులను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు కోరారు. కర్లెమ్మ రైతులతో కలిసి తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రీ సర్వేలో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. అన్ని హక్కులు ఉన్న భూ యజమానుల పేర్లు కాకుండా వేరే వ్యక్తుల పేరున భూములు నమోదు చేయడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. డీపట్టాలకు ఎల్‌పీఎం నంబర్లు ఆన్‌లైన్‌లో చూపించడం లేదన్నారు. పలుసార్లు గ్రామ సభలు నిర్వహించినా.. సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చినప్పటికీ ఫలితం లేదన్నారు.

అలంకారప్రాయం..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేటలో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న ఇంటింటికీ తాగునీటి కుళాయిలు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు మండలంలోని తురకపేట, తురకపేట సెంటర్, దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి తదితర గ్రామాల్లో కుళాయిలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వీటిని పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. అధికారులు, పాలకులు స్పందించి కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

కట్టు తప్పితే..



ఎల్.ఎన్.పేట మండలంలోని అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డుపై అధిక లోడుతో వెళ్తున్న వాహనాల పక్క నుంచి వెళ్లాలంటే భయం వేస్తోంది. చిన్న వ్యాన్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను ఎత్తుగా వేసి తీసుకువెళ్తున్నారు. వాహనానికి వేసిన కట్టుతప్పితే ప్రమాదం జరుగుతుందని వెనుక వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వాహనాలు రాత్రి సమయాల్లో సరుకులు రవాణా చేసేలా పోలీసులు, ఆర్టీఓ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. – ఎల్.ఎన్.పేట

చల్లదనం..



పాతపట్నం మండలంలోని గంగువాడలో నూకలమ్మ గ్రామ దేవత ఆలయానికి మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. మంగళవారం నూకలమ్మ మారు వారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 6వ తేదీన నూకలమ్మ అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. – పాతపట్నం

ముర్రాటల సమర్పణ



నరసన్నపేట మండలం పారశెల్లిలో ఎండల వారాల సందర్భంగా గ్రామ దేవతలకు మంగళవారం ముర్రాటలను సమర్పించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తామరాపల్లి గ్రామంలోనూ ఎండల వారాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. – నరసన్నపేట

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



పాతపట్నం: లాబరలో రైతులను సత్కరిస్తున్న రమణారావు



కొత్తూరు: తామరగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, గిరిజనులు

పాతపట్నం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని డీపీఎం పూజారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని చిన్నమల్లిపురం, కొరసవాడ, తీమర గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభలు నిర్వహించారు. లాబరలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సామాజికవేత్త రమణారావు సత్కరించారు. కె.పురుషోత్తం, ఎస్.రాజు, రైతులు పాల్గొన్నారు.

అవగాహన..

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంపై ఆల్తి పంచాయతీ పరిధి తామరగూడ, తదితర గూడల్లోని గిరిజన రైతులకు మంగళవారం ప్రకృతి వ్యవసాయం విభాగం మండల డీఎంఎంటీ జగన్ అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రామల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

వైస్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

సారవకోట: మండలంలోని రెండో వైస్ ఎంపీపీ ఎన్నికకు ఉన్నతాధికారులు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం సోమవారం తెలిపారు. రెండో వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య ఈ ఏడాది ఫిబ్రవరిలో మృతి చెందారు. ఆ పదవిని భర్తీ చేసేందుకు ఈ నెల 19న ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా మండల ప్రత్యేకాధికారినే నియమించారన్నారు.

అభినందన..



దైవకటాక్షంను అభినందిస్తున్న మహిళలు

పాతపట్నం: ఇటీవల టెక్కలిలోని సెంటినరీ చర్చిలో నిర్వహించిన స్త్రీల రీట్రిట్ పోటీల్లో పాతపట్నం మండలం కొరసవాడ ఆంధ్ర బాప్టిస్ట్ చర్చికు చెందిన కె.దైవకటాక్షం ప్రథమ స్థానం సాధించారు. ఈ విషయాన్ని చర్చి అధ్యక్షుడు బి.అనిల్ కుమార్ తెలిపారు. చర్చిలో కటాక్షంను మహిళా సభ్యులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని 20 సంఘాలకు చెందినవారు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబర్చారన్నారు. అందులో కొరసవాడ చర్చికు ప్రథమ స్థానం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సతీష్ బెహరా, ఉపాధ్యక్షుడు కె.లారెన్స్, పాస్టర్ ఎన్.ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

పులఖండం మృతి తీరని లోటు

ఆమదాలవలస: ప్రముఖ కవి పులఖండం శ్రీనివాసరావు మరణం సాహితీ రంగానికి తీరని లోటని ఆమదాలవలసకు చెందిన కవి కె.వి.రాజారావు మాస్టారు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు.

గిరిజనులపై అక్రమ కేసులు అన్యాయం



టెక్కలి ఆర్డీఓకు వినతిపత్రం అందేస్తున్న గిరిజన సంఘ నాయకులు

సారవకోట: గిరిజనులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో గిరిజనులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మెళియాపుట్టి మండలంలోని ఆంపురంలోని పలువురు గిరిజనులు నాటు సారా తయారీ, విక్రయాలు చేయకపోయినా గ్రామంలోకి ఎక్సైజ్ అధికారులు చొరబడి అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే గిరిజనులంతా ఏకమై దీనిపై ఉద్యమం చేపడతామన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టెక్కలి ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందజేసినవారిలో ఎస్.గిరీష్, జగన్, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పాతపట్నం: అవగాహన కల్పిస్తున్న పీఓ విమలారాణి

పాతపట్నం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పాతపట్నం సీడీపీఓ టి.విమలారాణి అన్నారు. మండల కేంద్రంలోని శివశంకర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. వాటికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సూపర్‌వైజర్ అనురాధ, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు రీసు చిరంజీవి అన్నారు. పురపాలక సంఘంలోని 10వ వార్డు హడ్కో కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'బాల్య వివాహాలు రహిత భారత దేశం' అనే కార్యక్రమంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. సచివాలయ మహిళా పోలీస్ ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగళ్ల మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..
విజ్ఞాన నిలయాలు



మెళియాపుట్టి గ్రంథాలయంలో విద్యార్థులకు బోధన చేస్తున్న ఎంఈఓ పద్మనాభరావు

- వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి
- పుస్తకపఠనంపై ఆసక్తి కనబరిస్తే సత్ఫలితాలు
- విద్యతోపాటు వినోదం

మెళియాపుట్టి: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా ఉండటానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఏప్రిల్ 28 నుంచి జూన్ 8వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉంటాయి. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితాలు రాబట్టవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అందుబాటులో 18 వేల పుస్తకాలు..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఐదు శాఖాగ్రంథాలయాలు, 25 బుక్ డిపోజిట్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో సుమారు 18,000 వరకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో చిన్నారులకు అవసరమైన నీతి, పొడుపు కథలు, విజ్ఞానం, విహార యాత్రలకు సంబంధించిన పుస్తకాలున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పిల్లల్లో పుస్తకపఠనం పెంపొందించే దిశగా గ్రంథాలయ అధికారులు కృషి చేస్తున్నట్లు చెబుతున్నారు. అందులో భాగంగానే కథలు చెప్పించడం తోపాటు వాటి సారాంశాలు వివరిస్తున్నారు. విద్యార్థులకు గ్రంథాలయాలు వేసవి విడిదిలా మారాయి. విశ్రాంత ఉపాధ్యాయులు, ఎంఈఓలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. చిన్నారులకు నైపుణ్యం కలిగించేలా ఆసక్తికరమైన విషయాలు బోధిస్తున్నారు. అదేవిధంగా వారిలోని సృజానత్మకతను వెలికితీయడానికి పలు రకాల పోటీలను సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విధిగా గ్రంథాలయాలకు పిల్లలను పంపాలని గ్రంథాలయ అధికారులు కోరుతున్నారు.

అన్ని రకాల పుస్తకాలున్నాయి..



గ్రంథాలయాల్లో ఎన్నో రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. విద్యార్థులకు అవిచాలా అవసరం. వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కథలు, ఆటలు, పుస్తకపఠనం చేయిస్తున్నాం. విద్యార్థుల సంఖ్య పెరగాలి, నిత్యం గ్రంథాలయాలకు విద్యార్థులు వస్తే ముఖ్యమైన విషయాలు బోధించాడానికి వస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు అందించే మంచి విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– ఆర్.అనురాధ, గ్రంథాలయాధికారి, మెళియాపుట్టి

కుంకుమార్చనలు

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామంలో రూ.కోటితో (విరాళాలు) నిర్మాణం చేపట్టిన కోదండ రామాలయం ప్రారంభ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. మహిళలు కుంకుమపూజలు, క్షీరాభిషేకం, ధాన్యాభిషేకం నిర్వహించారు. గ్రామంలో సీతారాముల విగ్రహాల తిరువీధి నిర్వహించారు. భజనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠంచనున్నారు.



కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు